క్లుప్తంగా

రామాలయంలో హరినామ సంకీర్తనలు



భజన చేస్తున్న భక్తులు

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులోని పడమటి వీధిలో ఉన్న రామాలయంలో మంగళవారం హరినామ సంకీర్తనలు మొదలయ్యాయి. బుధవారం ఉదయం వరకు వీటిని ఆపకుండా కొనసాగిస్తారు. ఈ కార్యక్రమానికి రుషికేష్ గురుదేవులు దేవానంద్ శిష్యులు విష్ణు దేవానంద్ హాజరయ్యారు. అన్న ప్రసాద వితరణతో కార్యక్రమం ముగుస్తుంది.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్ శ్రీవీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



కొడవలూరు: బహుమతులను అందజేస్తున్న ఎంఈఓలు

కొడవలూరు: భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం అనేక రకాల సేవలందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు చొరవ చూపాలి ఎంఈఓలు వసంతకుమారి, అంకయ్య పేర్కొన్నారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగ చిన్నారులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం రవి, ఐఈఆర్టీలు సునీత, హైమావతి, పురుషోత్తం, ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల మంజూరు

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో గల భవిత కేంద్రాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సందర్శించారు. మరుగుదొడ్లు లేకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని వీరికి నిర్వాహకులు తెలియజేశారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా మరుగుదొడ్లను త్వరగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

పొలాలకు బాట వేయించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రమిస్తున్న రైతులు

కొడవలూరు: పొలాలకు వెళ్లేందుకు వీలుగా కొడవలూరు మూలకట్ల సంఘ గిరిజన కాలనీ నుంచి రైల్వే ట్రాక్ వరకు బాట వేయించాలని రైతులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి వినతిపత్రాన్ని మంగళవారం వారు అందజేశారు. గిరిజన కాలనీ నుంచి రైల్వే ట్రాక్ వరకు ఉన్న వారు సన్న, చిన్న కారు రైతులేనని, పొలాలకు బాట లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. కాగా వీలైనంత త్వరగా బాటను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ స్ఫూర్తిని ఎమ్మెల్యే ఆదేశించారు.

జలదిగ్బంధంలో ప్రాథమిక పాఠశాల



కొడవలూరు: మండలంలోని కొత్తవంగల్లు మజరా గాంధీ గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాల జలదిగ్బంధంలో చిక్కుకుంది. గిరిజన చిన్నారులు నీళ్లలోనే నడుచుకొని పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. ఫలితంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. ఏటా ఇదే పరిస్థితి నెలకొన్నా, సమస్యను పరిష్కరించే దిశగా ఎవరూ చర్యలు చేపట్టడం లేదు. పాఠశాల ముందు గ్రావెల్‌తో కొంత ఎత్తు పెంచి ప్రహరీని నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుంది. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అప్రమత్తంగా ఉండాలి

• ఆర్డీఓ పావని

ఆత్మకూరు: భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీఓ బి.పావని సూచించారు. ఆమె తన కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు సూచనలు చేశారు. వాగులు, వంకల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సోమశిల, సంగం జలాశయాల అధికారులు ముందస్తు హెచ్చరికలు చేసి నీటి విడుదల చేయాలని ఆదేశించారు.

నిండా ముంచిన వాన

• వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం
• గుంతలమయంగా మారిన రోడ్లు
• నీట మునిగిన నారుమళ్లు

ఎడతెరిపి లేని వర్షాలు నిండా ముంచాయి. జన జీవనంపై తీవ్ర ప్రభావం పడింది. చాలాచోట్ల పొలాలు నీట మునిగాయి. ఓవైపు రైతాంగం ఆందోళనలో ఉండగా.. రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది.



గుంతలమయంగా కాగితాలపూరు రోడ్డు

మనుబోలు: ఫెంగల్ తుఫాన్.. దీని ప్రభావంతో పడిన వానలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మూడురోజులపాటు భారీ వర్షాలు కురిశాయి. అసలే గుంతలమయంగా ఉన్న వివిధ గ్రామాలకు వెళ్లే తారు, గ్రావెల్ రోడ్లు మరింత ఘోరంగా తయారయ్యాయి. బండేపల్లి గ్రామానికి వెళ్లే తారురోడ్డుపై అడుగు లోతు నీళ్లు పారుతున్నాయి. దీంతో గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు జనం పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. పలు గ్రామాల్లో వ్యవసాయ పొలాలు, నారుమళ్లు నీట మునిగాయి. గాలులకు పూరిళ్లు, రేకుల ఇళ్లు దెబ్బతిన్నాయి. కాగితాలపూరులో గడ్డం విమలమ్మ అనే మహిళ రేకులిల్లు పూర్తిగా ధ్వంసమైంది. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

ఆందోళనలో అన్నదాతలు

వర్షాలు ఇలాగే కొనసాగితే నీట మునిగిన నారుమళ్లు పాచిపోయే ప్రమాదం ఉంది. కొంతమంది రైతులు ఇటీవలే వరినాట్లు వేశారు. ఇప్పుడవి నీట మునగడంతో వర్షం మరింత పెరిగితే పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే మండల పరిధిలోని జాతీయ రహదారితోపాటు బద్దెవోలు రోడ్డు, మనుబోలు – పొదలకూరు ఆర్‌అండ్‌బీ రోడ్ల నుంచి వివిధ గ్రామాలకు వెళ్లేందుకు తారు, గ్రావెల్ రోడ్లున్నాయి. వీటిల్లో చాలా వరకూ దెబ్బతిని గతుకులు దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా ఈ రోడ్లపై ప్రయాణించే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలైనా రోడ్లకు మరమ్మతులు చేసిన దాఖలాల్లేవు.

ఆందోళనగా ఉంది



భారీ వర్షాలకు నారుమళ్లు నీట మునిగాయి. నారుమడి ఎక్కువ రోజులు నీటి కింద ఉంటే పాచిపోయే ప్రమాదం ఉంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వాన ఆగితే ఇబ్బంది ఉండదు. కానీ కొనసాగితే మాత్రం మళ్లీ నారు పోసుకోవాల్సి వస్తుంది.

– వెంకటరమణయ్య, సర్పంచ్, కొలనకుదురు

రోడ్లకు మరమ్మతులు చేయాలి



హైవే నుంచి కాగితాలపూరు, ఎల్‌ఎస్‌పురం గ్రామాలకు తారురోడ్డు అధ్వానంగా ఉంది. మనుబోలు నుంచి పిడూరు వెళ్లే రోడ్డుది కూడా ఇదే పరిస్థితి. చిన్న వర్షానికే రోడ్లపై గుంతల్లో నీరు చేరి బురదమయంగా మారుతున్నాయి. దీంతో వాహనాల్లో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేయించాలి.

– గుమ్మడి వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ సభ్యుడు, ఎల్‌ఎస్‌పురం



దెబ్బతిన్న రేకుల ఇల్లు



కొలనకుదురులో నీట మునిగిన నారుమళ్లు

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ

వెంకటాచలం: నిబంధనలు అతిక్రమించి ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసులునాయక్ హెచ్చరించారు. మండలంలోని అనికేపల్లి, గొలగమూడిలో ఎరువుల దుకాణాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల కొనుగోలు, అమ్మకాల రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. ఎరువులు, పురుగు మందులను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట ఏఓ హరికరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

వర్షాలకు మినుము దెబ్బతినే అవకాశం

• నీరు నిల్వ లేకుండా చూడాలి



సాగులో ఉన్న మినుము పంట

పొదలకూరు: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు సాగు చేస్తున్న మినుము, పెసర పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. అధిక వర్షపాతం నమోదైతే పంటలో నీరు నిల్వ చేరి కుళ్లిపోయే అవకాశం లేకపోలేదు. రైతులు ఎప్పటికప్పుడు పంటలను పరిశీలించి నీటిని బయటకు పంపాలని వ్యవసాయాధికారులు తెలిపారు. మండలంలో మినుము, పెసర స్వల్పంగానే సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో 500 ఎకరాల్లో మాత్రమే పప్పుధాన్యాల సాగు చేపట్టారు. అతివృష్టి లేదా అనావృష్టి వల్ల మెట్టపంటల రైతులు నష్టపోవడంతో అపరాల సాగును చాలా వరకు తగ్గించారు. ఐదేళ్ల క్రితం మండలంలో జానెడు మెట్ట పొలం కూడా ఖాళీ లేకుండా మినుము, పెసర పంటలను సాగు చేశారు. ఫలితంగా పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం 5 వేల ఎకరాల్లో ఉండేది. క్రమంగా నష్టాలు చవిచూస్తున్న రైతులు వాటి సాగును తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు ఇబ్బందికరంగా మారాయి. మినుములో ఆకుమచ్చ, పొగాకులద్దెపురుగు పడే అవకాశం ఉంది. వీటి వల్ల రైతులు బాగా నష్టపోతారు. నీటి నిల్వలు ఏర్పడితే వేరుకుళ్లు తెగులు కూడా పడుతుంది.

చిన్నపాటి కాలువల ద్వారా..



వర్షపునీరు నిల్వ ఉంటే మినుము, పెసర పంటలు దెబ్బతింటాయి. అందువల్ల రైతులు వర్షపునీరు పంటలో లేకుండా చిన్నపాటి కాలువల ద్వారా బయటకు పంపించి వేయాలి. తర్వాత గాలిసోకితే పంటకు నష్టం ఉండదు. తెగుళ్ల నివారణకు డైథెన్ ఎం–45 శిలీంద్ర నాశిని లార్విన్‌తో కలిపి పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెగులుతోపాటు దోమపోటు ఆశించడంతో ఆకులు పసుపు పచ్చగా మారుతుంటాయి. డైథెన్ ఎం–45తోపాటు, ట్రైజోఫాస్‌ను కలిపి పిచికారీ చేసుకుంటే సరిపోతుంది.

– ఎ.వాసు, ఏఓ, పొదలకూరు

ట్రై సైకిళ్ల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం: ట్రై సైకిళ్లను అందుకున్న వారితో వేమిరెడ్డి దంపతులు, ఎస్పీ కృష్ణకాంత్

బుచ్చిరెడ్డిపాళెం: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లను వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ కృష్ణకాంత్ హాజరయ్యారు. అనంతరం మండలంలోని 26 మంది దివ్యాంగులకు వీటిని ఎస్పీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. వేమిరెడ్డి దంపతులు, ఎస్పీని మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ సత్కరించారు.

• గంజాయికి బానిసలై తమ జీవితాలను యువత నాశనం చేసుకుంటున్నారని, దీనిపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ కృష్ణకాంత్‌ను ప్రశాంతిరెడ్డి కోరారు.

• **విడవలూరు:** సాయం చేయడంలో వీపీఆర్ ఫౌండేషన్ ముందుంటుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. అనంతరం మండలంలోని 27 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. ఎంపీడీఓ నగేష్‌కుమారి, తహసీల్దార్ చంద్రశేఖర్, చెముకుల శ్రీనివాసులురెడ్డి, అడపాల శ్రీధర్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• **కొడవలూరు:** దివ్యాంగులకు తమ వంతు సాయమందిస్తున్నామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. తహసీల్దార్ స్ఫూర్తి, ఎంపీడీఓ సుబ్బారావు, నేతలు శ్రీహరిరెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అమరేంద్రరెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, మల్లికార్జున, ప్రవీణ్‌కుమార్, వెంకీ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు దుస్తుల పంపిణీ



పొదలకూరు: అయ్యప్ప మాలధారణలో ఉన్న భక్తులకు పట్టణంలోని వెంకయ్యస్వామి ఆలయంలో నాగార్జున స్కూల్ చీఫ్ అడ్వైజర్ అన్నం సుబ్బారావు వారి కుమార్తె పార్థవి కలిసి మంగళవారం దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు కృష్ణస్వామి పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి అమ్మవారు భక్తుల కొంగు బంగారమని ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొర్నా నారాయణరావు పేర్కొన్నారు. ఆలయంలో అమ్మవారి క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈఓ తాతా శ్రీనివాసరావు, పీఎల్ రావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం



మనుబోలు: మండలంలోని మనుబోలు చెర్లోపల్లి రైల్వేగేట్ సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

చెరువు తూముకు షట్టర్ల ఏర్పాటు

మనుబోలు: మండలంలోని కొలనకుదురు చెరువు తూముకు మంగళవారం షట్టర్లు ఏర్పాటు చేశారు. అవి దెబ్బతినడంతో సాగునీరు వృథాగా పోతుండేదని రైతులు తెలిపారు. ఈ విషయాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాలతో పాత షట్టర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు.

విద్యుత్ అదాలత్ నేడు

కోవూరు: విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విద్యుత్ అదాలత్‌ను బుచ్చిరెడ్డిపాళెంలోని సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం నిర్వహించనున్నామని కోవూరు ట్రాన్స్‌కో ఈఈ రమేష్‌చౌదరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల పర్యటన



మినుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పొదలకూరు: శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు మండలంలోని గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఒక బృందంలో నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శివజ్యోతి, కిరణ్, పొదలకూరు ఏఆర్ఎస్ శాస్త్రవేత్త సురేఖ ఉన్నారు. వీరు ఇనుకుర్తి, ముదిగేడు, పొదలకూరు, అమ్మవారిపాళెం, అయ్యగారిపాళెం, ప్రభగిరిపట్నం, నందివాయ గ్రామాల్లో మినుము, పెసర పంటలను పరిశీలించారు. రెండో బృందంలో నెల్లూరు జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి, ఏఓ మధురిమ, పొదలకూరు ఏఆర్ఎస్ శాస్త్రవేత్త హుసేనీ బేగం, వ్యవసాయాధికారి ఎ.వాసు ఉన్నారు. వీరు తోడేరు, మొగళ్లూరు, ఊసపల్లి, అంకుపల్లి, వావింటపర్తి, పులికల్లు, ఆర్‌వైపాళెం గ్రామాల్లో మినుము, పెసర, వరి పంటలను పరిశీలించారు. ఫెంగల్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు పొలాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే బయటకు పంపాలని రైతులకు తెలిపారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డుల స్వాధీనం



విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ముత్తుకూరు: మండలంలోని పరిషత్ కార్యాలయంలో మంగళవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ముత్తుకూరు పంచాయతీలోని చలివేంద్ర గ్రామానికి చెందిన ఎస్.వెంకటేశ్వర్లు ఇటీవల సమాచార హక్కు చట్టం ద్వారా మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించిన వివరాలను అడిగారు. అయితే రికార్డుల్లేవని ఉద్యోగులు బదులిచ్చారు. దీంతో వెంకటేశ్వర్లు సమాచార హక్కు చట్టం కమిషనర్, కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విజిలెన్స్ సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో తనిఖీలు జరిపారు. ఆర్టీఐ కమిషనర్ కూడా రికార్డులు అప్పగించాలని ఆదేశించడంతో విజిలెన్స్ అధికారులు కార్యాలయం నుంచి 23 రికార్డులు సేకరించి స్వాధీనం చేసుకున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



ర్యాలీలో అధ్యాపకులు తదితరులు

విడవలూరు: ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సుజాత పేర్కొన్నారు. స్థానిక పీఆర్ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పార్లపల్లి వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీని మంగళవారం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు తగు సూచనలు చేశారు. వైస్ ప్రిన్సిపల్ మధు, ఎన్నెస్సెస్ కోఆర్డినేటర్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా తప్పనిసరి



విడవలూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

విడవలూరు: పంట బీమాను రైతులు తప్పక చేసుకోవాలని కోవూరు వ్యవసాయ సహాయ సంచాలకులు సుజాత కోరారు. మండలంలోని విడవలూరు – 1, పార్లపల్లిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. వర్షాలు తగ్గాకే వరినాట్లు వేయాలని సూచించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్యతో కలిసి పొలాలను పరిశీలించారు. వీఏఏలు తమీమ్ అహ్మద్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

• **ఇందుకూరుపేట:** పంట వివరాలను రైతులు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జంగంవానిదొరువులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులో పంట రుణాలు తీసుకోని రైతులు ఎకరానికి రూ.168 చెల్లించి బీమా చేసుకోవాలని కోరారు. వీఏఏ తిరుమల, వీహెచ్ఏ దీక్షిత తదితరులు పాల్గొన్నారు.

• **కొడవలూరు:** వరి నాటిన ఏడు నుంచి పది రోజుల్లోపు ఆకుముడత తెగులు ఆశించే అవకాశం ఉందని, ఈ క్రమంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని గండవరం, గౌతమ్‌నగర్‌లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. 400 మిల్లీలీటర్ల క్లోరోఫైరిఫాస్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలని కోరారు. జేవీఓ వెంకటేశ్వర్లు, వీఏఏలు శ్రావ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

• **తోటపల్లిగూడూరు:** పొలాల్లో చేరిన వర్షపు నీటిని వెంటనే బయటకు పంపాలని మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి సూచించారు. మండలంలోని చిన్నచెరుకూరు, ఇస్కపాళెం రైతు భరోసా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలకు చాలా ప్రాంతాల్లో సాగులో ఉన్న వరిపంట నీటమునిగిందన్నారు. ఎక్కువ రోజులు నీరు ఉంటే నారు పాచిపోవడం, మిగిలిన పంటకు తెగుళ్లు సోకే ప్రమాదముందన్నారు. రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో వీఏఏలు, షర్మిల, శివకుమార్, ఇతర వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: జంగంవానిదొరువులో..



కొడవలూరు: గండవరంలో..

దివ్యాంగులకు అండగా ఉందాం



ముత్తుకూరు: చిత్రాల ప్రదర్శన



ఇందుకూరుపేట: విజేతలతో ఉపాధ్యాయులు

ముత్తుకూరు: దివ్యాంగులకు అన్ని విధాలుగా అండగా ఉందామని, వారిని ప్రోత్సహిద్దామని ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ చైర్‌పర్సన్ ధరణిజ అన్నారు. మంగళవారం స్కూల్లో హెచ్‌ఎం చల్లా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జరిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ స్రవంతి, ఐఈఆర్టీ కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: సమాజంలో అందరూ సమానమేనని ఎంఈఓ – 2 సునీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో దివ్యాంగులకు క్రీడా పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ముజీర్ తదితరులు పాల్గొన్నారు.